# నిర్ణయాలు

ఆ రోజు సోమవారం కావటంవల్ల బ్యాంకులో క్యాష్‌కౌంటర్ దగ్గిర చాలా రద్దీగా ఉంది. అసిస్టెంట్ క్యాషియర్ అసలే చిర్రుబుర్రులాడే స్వభావం కలవాడు. రద్దీగా ఉండి ఇచ్చిపుచ్చుకునే జనం తొందరపెడుతూ ఉంటే కల్లుతాగిన కోతి నిప్పులు తొక్కినట్టే అయింది. చీటికీ మాటికీ అతను చిటపటలాడుతుంటే జనానికి అదొక తమాషాగా ఉంది. ఈ తంతంతా విశ్వం చిరునవ్వుతో ఉబుసుపోకగా చూడసాగాడు.

“నలభైతొమ్మిది.” అన్నాడు అసిస్టెంట్ క్యాషియర్. క్లాసులో టీచర్ హాజర్‌పట్టీ చదువుతున్న ఫక్కీలో “అమ్మయ్య” అనుకుని విశ్వం టోకెన్ జేబులోంచి తీసి కౌంటర్ కిటికీమీద గల్లున మోగించాడు. కళ్ళజోడు లోంచి పైకిచూస్తూ “ఎంత” అన్నాడు అసిస్టెంట్ క్యాషియర్ “అడక్కుండా చెప్పలేవా ?” అని గదమాయిస్తున్నట్లు.

“అయిదొందలు”

అసిస్టెంట్ క్యాషియర్ అయిదు ఒకట్ల కట్టలు తీసి కౌంటర్ కిటికీలో దూర్చబోతుంటే “బాబోయ్, పదులైనా అయిదులైనా ఇవ్వండి.” అన్నాడు విశ్వం.

“అయితే అందరూ ఒకట్లొద్దంటే ఎట్లాగయ్యా.” అని ఎంతో ఔదార్యం చూపుతున్నట్టు నాలుగు కట్టలు ఉపసంహరించి, పదిరూపాయల నోట్లు కొన్ని చప్పు చప్పున లెక్కపెట్టి విశ్వం ముఖాన కొట్టి ఇక విరగడ కమ్మన్నట్టు “యాభైరెండు” అన్నాడు.

"అయ్యో" అంటూ ఓ పల్లెటూరి ఆసామీ విరగదొక్కుకుంటూ కౌంటర్ దగ్గరకి వచ్చి అక్కడ మూగినజనాన్ని బలంగా అటూ ఇటూ నెట్టేశాడు. విశ్వం నోట్లు లెక్కపెట్టుకుందామని ప్రయత్నించి, ఆ పల్లెటూరి ఆసామీ దాడివల్ల విఫలుడై అక్కడినుంచి నెమ్మదిగా బయటపడ్డాడు. బ్యాంక్ భవనం వరండాలోకి వచ్చి కాస్త ఊపిరి పీల్చుకుని, కనీసం పదులైనా లెక్కపెట్టాలని ఉపక్రమించాడు. అతను సాధారణంగా డబ్బు ఎవరిచ్చినా లెక్కచూసుకోకుండా జేబులో వేసుకుంటాడు. రెండు మూడు నెలల క్రితం ఆ అలవాటు చొప్పునే ఆ అసిస్టెంట్ క్యాషియర్ నించే వెయ్యి రూపాయల చెక్కుకి డబ్బు తీసుకొని జేబులో వేసుకున్నాడు. అన్నీ పదులు, ఒక మిత్రుడు అప్పు అడిగితే బ్యాంక్‌నించి విత్‌డ్రా చేశాడు. ఆ మిత్రుడికి ఆ పదులకట్ట అలాగే ఇచ్చేశాడు. అయితే అతను కొంచెం వ్యవహారంపట్ల నిర్మొహమాటస్థుడు కనుక విశ్వందగ్గిరే డబ్బు లెక్కచూశాడు. కాసేపు తటపటాయించి, కొంచెం తెల్లముఖంవేసి "తొంబయి తొమ్మిదే ఉన్నాయి బ్రదర్ నేను పొరపాటు చూశానేమో, నువ్వు లెక్కపెట్టు" అన్నాడు. విశ్వం లెక్కపెట్టాడు, అతని ముఖం వివర్ణమైంది. సరాసరి అసిస్టెంట్ క్యాషియర్ దగ్గిరికివెళ్ళి "సార్, ఇంతక్రితమే మీరిచ్చిన పదులకట్టలో తొంబయితొమ్మిదే ఉన్నాయి. ఇదిగో చూడండి"అన్నాడు. ఆయన కళ్ళద్దాలలోంచి తీక్షణంగా విశ్వం వైపుచూసి, "కౌంటర్ విడిచి పెట్టకముందే డబ్బు లెక్కచూసుకోవాలండీ. ఇప్పుడేం లాభంలేదు." అని నిష్కర్షగా అన్నాడు.

విశ్వంకి ముఖం జేవురించింది. కాని అతనేమీ సమాధానం ఇవ్వకుండా వెళ్ళిపోయి తన దగ్గిరవున్న డబ్బు కలిపి మిత్రుడి కిచ్చాడు.

రెండు మూడు నెలలకిందట జరిగిన ఈ సంఘటన విశ్వం మనసులో మెదిలి పదిరూపాయలనోట్లు లెక్కచూడ సాగాడు. యాభై వున్నాయి. మళ్ళీ లెక్కచూశాడు. యాభై, సరిగా జ్ఞాపకం చేసుకున్నాడు. బ్యాంకుకి

వచ్చేటప్పుడు తన దగ్గిర ఐదురూపాయలనోట్లు సరిగా రెండున్నాయి. పదులు అసలు లేవు. మరి అసిస్టెంట్ క్యాషియర్ పొరపాటున ఎక్కువ ఇచ్చాడా ! రూపాయనోట్లు చూశాడు సరిగా వంద ఉన్నాయి. సందేహంలేదు. పాపం, అసిస్టెంట్ క్యాషియర్ తొందర్లో ఎక్కు విచ్చాడు. వందరూపాయలకట్ట ఒకటి ఇచ్చినట్టు గుర్తు లేక అయిదువందలు పదిరూపాయల నోట్లు ఇచ్చాడు. సాయంకాలం లెక్కచూసుకుని లబోదిబో మంటాడు. అప్పుడతను తొక్కేచిందులు చూడాలి ! విశ్వం పెదవులమీద చిరునవ్వు వెలసింది. ఇంతలోనే అతనికి క్యాషియర్ మీద జాలివేసింది. పాపం, ఆయన దుస్తులు చూస్తే ఎంతో బీదవాడని తెలుస్తుంది. చిరిగిన చొక్కా. మాసిన గడ్డం. లోతుకుపోయిన కళ్ళు. విశ్రాంతి నెరగని వదనం.

విశ్వం వెంటనే వెనక్కితిరిగి కౌంటర్ దగ్గిరికి వెళ్ళాడు. క్యాషియర్ ఎవరిమీదో అరుస్తున్నాడు.

"ఎన్నిసార్లయ్యా నీకు చెప్పేది ! ఒకట్ల కట్ట ఒక్కటికంటె తీసుకునేది లేదు మార్చుకురా. ఆఁ-ఎవరయ్యా, ఏమిటి, డబ్బు తీసుకోమంటావా ? తీసుకునేందుకు కదుటయ్యా మేమిక్కడ కూర్చుంది ! కాస్త ఆగు, నీ ముందు వచ్చిన వాళ్ళు గంటనించీ కూర్చున్నారు. అలా తొందరపడతావేం! జనం ముసిముసిగా నవ్వు కుంటున్నారు.

"సార్ ఇందాక అయిదువందలిచ్చారే లెక్క పొరపాటు వచ్చిందండీ." అన్నాడు విశ్వం.

అసిస్టెంట్ దడాలున తాతామండలానికి లేచాడు. "ఎక్కడో షికార్లుకొట్టి లెక్క పొరపాటొచ్చిందంటే నేనేం చేసేదయ్యా అదిగో బోర్డుచూడు. కనిపిస్తోందా ? కౌంటర్ విడిచిపెట్టకముందే డబ్బు లెక్కచూసుకొనవలెను ఏం ? ఎందుకయ్యా బోర్డుపెట్టింది ? చదువుకోలా ? వెళ్ళువెళ్ళు.

విశ్వం ముఖం చిట్లించుకున్నాడు.

"నేను చెప్పేది కాస్త వినిపించుకుంటారా ?" అన్నాడు విసుగ్గా.

"ఇంకా ఏమిటయ్యా చెప్పేది. ఇక్కడ బాతాఖానీ వేస్తూ కూర్చొంటే ఈ జనమంతా ఏం కావాలి ?" అన్నాడతను. విశ్వంకి కోపం వచ్చింది. "ఒక వంద ఎక్కువిచ్చావయ్యా, స్వామీ" అని ఆ నోట్లు అతనివైపు గిరాటేస్తే, ఆ ముఖంలో రంగులు ఎలా మారతాయో! జేబులోంచి అయిదు రూపాయలనోట్లు తీశాడు. కాని వెంటనే ఊహ తట్టింది. ఇతని దూకుడుకు తగిన శాస్తిచేయాలి. బీదవాడుగదా అని సానుభూతి కొద్దీ మాట్లాడుతుంటే ఎగిరెగిరి పడుతున్నాడు. డబ్బివ్వకపోతే సాయంత్రానికి ఆ పొంగు అణిగిపోతుంది. నాలుగురోజు లాగి ఎవరిచేతనైనా కబురు చేస్తే పరుగెత్తుకొచ్చి కాళ్ళమీద పడతాడు. అప్పుడు నాలుగూ దులిపి ఆ డబ్బు వాపసు ఇవ్వవచ్చు.

ఈ ఊహ రాగానే విశ్వం మరి మాట్లాడకుండా చరచర వెళ్ళిపోయాడు. విశ్వం స్టేషనుకు వెళ్ళేసరికి రైలువచ్చి ఉంది. అతను అదరాబాదరాగా టికెట్ కొని చప్పున బ్రిడ్జిఎక్కి సెకండుక్లాస్ కంపార్టుమెంటులోకి జొరబడ్డాడు. పెట్టెలో జనం అతన్ని మరో వాటాదారుగాచూసి ముఖం చిట్లించుకుని అయిష్టంగా సర్దుకున్నారు. గార్డు విజిల్ వేశాడు. అంతలోనే ఓ లావాటాయన నురుగులు కక్కుతూ వచ్చి హోల్డాల్ పోర్టర్చేత లోపలికి తోయించి ఎలాగో సందుచేసుకుని తలుపుదగ్గిర నిలబడ్డాడు. రెక్టిన్ జిప్ బ్యాగ్ సంకలో పెట్టి, జేబులోంచి పర్స్‌తీసి పోర్టర్ చేతిలో ఇరవై పైసలు పెట్టాడు.

"ఇదేంటి బాబూ, నలభై పైసలండి." అన్నాడు పోర్టర్.

"చాల్చాల్లే, నలభై పైసలా నయం. అర్ధరూపాయి అన్నావు కావు." అన్నాడు ఆగంతకుడు.

"టైమైపోయింది. తొరగా ఇప్పించండిబాబూ," అన్నాడు పోర్టర్ తలుపు కమ్మీ పట్టుకుని. "డబ్బిస్తేగాని కదిలేది" లేదన్నట్టు.

"పోరా పో" అన్నాడు కరుగ్గా ఆ వ్యక్తి.

"ముప్పయి అయినా ఇప్పించండిసామీ. ఖలేబేరం" పోర్టర్ బేరంచేయ సాగాడు.

'పైసా ఇవ్వను పో, పో.'

"ఏంటిబాబూ, అసలు ముప్పయి పైసలు గవర్నమెంట్ రేటే, అంతకంటే కూడా తక్కువిస్తారేంటి! మా నోటిమీదకొట్టి మీరు బాగుపడతారా! ఇచ్చే మారాజులాగా బేరం అడక్కుండా పట్టించుకొస్తే ఏంటో అనుకున్నాను. ఇప్పించండి తొరగా." పోర్టర్ కాస్త మర్యాద మెట్టు దిగాడు.

"పొమ్మంటుంటే, నీక్కాదూ సరే, అలాగే నిలబడు నీకంటె మొండిని నేను," ఆ ఆసామి తాబట్టిన కుందేటికి మూడేకాళ్ళని భీష్మించాడు.

పోర్టర్ రైలు కదిలేవరకూ నోటికివచ్చినట్టు శాపనార్థాలు పెట్టాడు. ఆ వ్యక్తి చివరికి చెప్పుకూడా తీశాడు. నలుగురూ అయన్ని సర్దారు.

విశ్వంకి ఆయన్నిచూస్తే ఈసడింపు కలిగింది. రైల్వే రేటు ప్రకారం పోర్టరికి కూలీ ఇవ్వకపోగా అతన్ని కొట్టటానికికూడా సిద్ధమైనందుకు ఆ వ్యక్తివైపు తిరస్కారభావంతో చూశాడు.

"ముప్పయిపైసలు ఇవ్వవలసిందండీ" అన్నాడు విశ్వం ఉండబట్టక.

ఆయన విశ్వంవైపు చురచుర చూసి "తేరగావస్తే మావాడూ ఇంకోడున్నాడు అన్నాట్ట. ఏం నాయనా, నువ్వు నక్సలైటువా కొంపదీసి?" అన్నాడు. చుట్టుపక్కలవాళ్ళు నవ్విన సవ్వడి వినిపించి, విశ్వం ఎర్రబారిన వదనంతో తలెత్తి అందరివైపూ ఒకసారి చూశాడు. ఎవరికీ పోర్టర్‌పట్ల సానుభూతి ఉన్నట్లు కనిపించలేదు. "అవును, సెకండుక్లాస్ జనంకదా:" అనుకున్నాడు విశ్వం.

సరిగ్గా అదే సమయంలో రైలు కదిలింది. ఇంతలో ఒకవ్యక్తి అందర్నీ తోసుకుని తలుపువైపు రాసాగాడు. యధాలాపంగా విశ్వం అతనివైపు చూశాడు. క్షణంలో విశ్వం 'షాక్' తగిలినవాడిలా కంపించాడు. సూటూ-బూటూ వేసుకుని పెద్దమనిషిలా ఉన్న ఆ యువకుడు, పోర్టర్‌తో మాట్లాడిన పెద్దమనిషి తాలూకు జిప్‌బ్యాగ్ అడుగుభాగం బ్లేడుతో పర్రున కోసి ఏవో చిక్కించుకొని రైలుదిగి పోతున్నాడు. లోకాభి రామాయణంలో మునిగి జనం ఇది గమనించలేదు.

విశ్వం వెంటనే కేకవేయబోయి, అప్రయత్నంగా మానేశాడు. తనెందుకు కల్పించుకోవాలి! చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరువైనట్లు, కూలీ జనం కడుపులుకొట్టి మూటలు కట్టుకునే ఇలాంటి పెద్దమనుషుల డబ్బు అలాగే ఎవరికో దక్కుతుంది. పదిపైసల దగ్గిర బేరా లాడాడు. పాపం, ఎంత ఖాళీ అయిందో! తను కల్పించుకొంటే వెంటనే ఆ దొంగని పట్టుకుని ఆ డబ్బు దక్కించేవాడే. కాని తనకేం! ఎవరి చేసుకున్న కర్మ వారిది!

అమ్మాయి బంగరు బొమ్మలా ఉంది. అంతో ఇంతో చదువూ, సంగీత జ్ఞానమూ ఉన్నాయి.

"మీ పేరేమిటండీ?" అన్నాడు విశ్వం.

"రేఖ" అంది ఆ అమ్మాయి కొంచెం సిగ్గుగా. ఓ క్షణం వాలుచూపులు అతనిపై విసిరింది. అవే పగ్గాలయాయి. ఏయే లోకాల్లోనో విహరించాడు విశ్వం. అతను తిరిగి ఈ లోకానికి వచ్చేసరికి రేఖ అక్కడ లేదు. మగ పెళ్ళివారి బెట్టుతో "ఇంటికి వెళ్ళి ఉత్తరం వ్రాస్తానండీ" అన్నాడు. విశ్వం. తండ్రీ, చెప్పదగిన చుట్టాలూ లేకపోవటంవల్ల విశ్వమే పెళ్ళి పెద్ద. తల్లి అతనిమాటకి ఎదురు చెప్పదు. అందువల్ల ఆమెకూడా ఏమీ ఖచ్చితంగా చెప్పలేదు. పెళ్ళికూతురుతండ్రి చాలా ఆశతో ఉన్నాడు.

విద్య, ఆస్తి ఉన్నవాడు. కట్నంమీద ఇచ్ఛలేనివాడు. అదృష్టంకొద్దీ ఈ సంబంధం దొరికిందని మురిసిపోతున్నాడాయన.

"ఉత్తరం ఎందుకండీ నేనే వస్తాను." అన్నాడు.

"ఎందుకండీ శ్రమ, నేను రాస్తాగా." అన్నాడు విశ్వం.

"ఉత్తరాలతో పనులవుతాయా ! ఎప్పుడు రమ్మంటారో చెప్పండి. మా అబ్బాయికి ఈ ఊళ్ళోనే సంబంధం కుదిరింది. దైవానుగ్రహంవల్ల ఈ సంబంధం అమ్మాయికి నిశ్చయమైతే ఇద్దరికీ ఒకేముహూర్తానికి పెళ్ళి జరిపిద్దామని ఉంది." అన్నాడు పెళ్లికూతురు తండ్రి.

ఆయన ఆదుర్దా చూచేసరికి విశ్వంకి కొంచెం జాలివేసింది.

"సరే పెద్దవారు మిమ్మల్ని తిప్పించటం నా కిష్టంలేదు. ముహూర్తం పెట్టిస్తే నా ఆక్షేపణ ఏమీలేదు" అన్నాడు.

పెళ్ళికూతురు తాలూకు యావన్మందికీ ఆ మాటలు పూలజల్లులు అయాయి.

"సంతోషం, శుభవార్త. మరి కట్నం కానుకలు—' అడిగాడు పెళ్ళి కూతురు తండ్రి.

"ముందే చెప్పానుగదండీ, కట్నం తీసుకోను."

పెళ్ళికూతురు తండ్రి ముఖం వికసించింది.

"అబ్బాయికి కట్నం ఏమిస్తున్నారు ?" అంది విశ్వం తల్లి, ఛాందసం పూర్తిగా విడిచిపెట్టలేక.

ఇష్టం లేకపోయినా, పెళ్ళికూతురు తండ్రి విషయం చెప్పాడు. ఆరు వేలుట. అప్పులుండి, ఇష్టం లేకపోయినా కట్నం తీసుకుంటున్నారట.

విశ్వం కళ్ళలో నీరవచ్చింది. తన ఆదర్శం ఇలాంటివాళ్ళకు లాభం చేకూర్చటానికా !

"అలాగైతే మీరెంత తీసుకుంటే నాకూ అంతకట్నం ఇవ్వవలసివస్తుంది. అలా కాకపోతే, మీఇష్టం మీది. నా ఇష్టం నాది" విశ్వం మంకుపట్టు పట్టాడు. పెళ్ళికూతురుతండ్రి తన ఆర్థిక పరిస్థితిని చెప్పుకుని ప్రాధేయ పడ్డాడు. కాని విశ్వం పట్టువదల్లేదు. రోషంతో అక్కడనుండి వచ్చేశాడు.

బ్యాంకులో అసిస్టెంట్ క్యాషియర్ ఉద్యోగం చేస్తున్న ఒకవ్యక్తి, లావాదేవీల్లో వందరూపాయలు ఎక్కువిచ్చి జీతండబ్బులు కట్టుకుని, అన్యమనస్కంగా నడుస్తూ ఆ సాయంకాలమే ప్రమాదవశాత్తు కారుకిందపడి మరణించాడనీ,

రిటైర్డ్ స్కూల్‌టీచర్ ఒకాయన పట్నంనుంచి ఇన్సూరెన్సు తాలూకు డబ్బు తెచ్చుకుంటూ, రైల్లో జిప్‌బాగ్ కోసి డబ్బంతా కాజేసినందువల్ల, గుండె ఆగి చనిపోయాడనీ, విశ్వం మర్నాడు పేపర్లో చదవకపోతే, రేఖ అనే ఒక అమ్మాయి జీవితంమీద విరక్తి చెందినట్టు జాబురాసి, ఎండ్రిన్ తాగి మరణించిందని కూడా ఆ మర్నాడు చదవవలసి వచ్చేది. అయితే అదృష్టంకొద్దీ, సమయానికి 'విశ్వం వచ్చాడని' ఇంట్లో గుప్పుమంటే, రేఖ పత్రురన జాబు చింపేసి, ఎండ్రిన్ సీసా దూరంగావిసిరేసింది.

(1969)

— o —